

రామ్మోహన్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బాలానగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు, సభ్యులు కాలనీ సమస్యల పరిష్కారం, కాలనీవాసుల సంక్షేమం కోసం పని చేయాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్‌నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామ్మోహన్ బుధవారం బండి రమేష్‌ను బాలానగర్ పార్టీ కా ర్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌ను ఆయన శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు లక్ష్మయ్య, యుగేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

'ఉపవాస దీక్షలు ఎంతో పవిత్రమైనవి'

బాలానగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేపట్టే ఉపవాస దీక్షలు ఎంతో పవిత్రమైనవని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని దిల్‌ఖుష్‌నగర్‌లో మసీద్ కమిటీ, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్‌లో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ముజీద్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి మహ్మద్ ఖాజా, కృష్ణమూర్తి, షేక్ కరీముల్లా, సయ్యద్ సలీం, వెంకటాచారీ, రామచంద్రా చారి, మత పెద్దలు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కతో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, ప్రతినిధులు

'మిషన్ భగీరథ అధికారులకు శిక్షణ ఇస్తాం'

రాయదుర్గం, మార్చి25 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో బుధవారం శ్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే రాష్ట్రంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదలశాఖలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్న అధికారులకు కూడా శిక్షణ ఇస్తామని గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. ఈమేరకు బుధవారం రామేశ్వర్‌రావు, ప్రతినిధులు మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రామేశ్వర్‌రావు తెలిపారు. ఈ ట్రైనింగ్‌కు ఏడాదికి రూ.12 కోట్లు ఖర్చవుతుందని, మొదటి దశ కింద 20 జిల్లాలో బ్యాచ్‌కు 60మందికి చొప్పున ఒక్కో జిల్లాలో 5 ట్రైనింగ్‌సెంటర్లను నిర్వహిస్తామని రామేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వరదనీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

ఖైల్‌కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ కాలనీలను అభివృద్ధి పరుస్తున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలో భారతీనగర్ డివిజన్ ఎంఐజీ కాలనీలో రూ.98.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వరదనీటి కాలువ నిర్మాణ పనులకోసం డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఐజీకాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లపై ప్రత్యేక శ్రద్ధవహించి వాటిని తిరిగి నిర్మించామని, 90శాతం పనులు పూర్తిచేశామన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించామన్నారు. దాదాపు కోటి రూపాయలతో చేపట్టనున్న పనుల వల్ల వరదనీటి ముంపు ప్రాంతాల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, కాలనీ నాయకులు, బూన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం..
తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఓ బాలిక (16) ఆచూకీని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో నివాసముంటూ చెత్త ఏరుకొని జీవనం సాగిస్తున్న దంపతులకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా, ఈనెల 24న తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా తమ కుమార్తె అదృశ్యం కావడంలో ఓ యువకుడి ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ కనుగొన్న పోలీసులు కుటుంబసభ్యులను, యువకుడితో పాటు బాలికను బుధవారం స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. సదరు యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇలా అయితే రాకపోకలు ఎలా?



కేపీహెచ్‌బీ రోడ్డు నం.1 వెనుక రోడ్డులో ఇదీ పరిస్థితి



రెండో రోడ్డులో రెండు వైపులా బైకుల పార్కింగ్.. మధ్యలో వాటర్ ట్యాంకర్

- అసలే గల్లీ రోడ్లు.. ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు
- వాటర్ ట్యాంకర్ల రాకపోకలతో ట్రాఫిక్ జామ్‌లు
- ఇబ్బంది పడుతున్న కేపీహెచ్‌బీ వాసులు, వాహనదారులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు తాగునీటి ఎద్దడి.. మరోవైపు ట్రాఫిక్ సమస్య.. దీంతో కేపీహెచ్‌బీ పరిసర ప్రాంత ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. ఏ గల్లీలో చూసినా ఒక ట్రెండు వాటర్ ట్యాంకర్లు దర్శనం ఇస్తున్నాయి. దీంతో ఆయా గల్లీల నుంచి టూ వీలర్ కూడా బయటకు వెళ్లే పరిస్థితి కన్పించడం లేదు. ట్యాంకర్ల కారణంగా నిమిషాల తరబడి వీధుల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అసలే ఇరుకు గల్లీలు.. ఆపై రోడ్డుకు రెండు వైపులా బైక్‌లు లేదా కార్లు పార్కింగ్ చేస్తున్నారు. ఆ మధ్యలోనే వాటర్ ట్యాంకర్‌ను నిలిపి సంపులో నీళ్ల నింపుతున్నారు. ఆ సమయంలో సుమారు అరగంట పాటు ఆ గల్లీలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఎంత ముఖ్యమైన పని ఉన్నా కూడా చేసేది ఏమీ లేక ద్విచక్ర, ఇతర వాహనదారులు ట్యాంకర్ వెళ్లే వరకు అక్కడే వేచి ఉండాల్సి వస్తోంది.

ఆ ఇళ్ల వారి పరిస్థితి దయనీయం..

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలో సుమారు 500 వరకు ప్రైవేట్ వసతి గృహాలు ఉన్నాయి. బాయ్స్, గర్ల్స్‌కు ఇక్కడ గల్లీ గల్లీలో హాస్టళ్ల ఉన్నాయి. కేపీహెచ్‌బీ ప్రాంతంలో ఏదైనా రోడ్డులో హాస్టల్ లేదంటే.. అక్కడి వారంత అదృష్టవంతులు మరొకరు ఉండరు. అయితే, గల్లీల్లో కూడా పుట్టగొడుగుల్లా పదుల సంఖ్యలో వసతి గృహాలు ఏర్పాటు చేయడంతో వేసవిలో తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో జల మండలి ట్యాంకర్లతో పాటు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వసతి గృహాలు ఉండే ప్రాంతాల్లోని ఇళ్లవారి పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆఫీసులకు వెళ్లేటప్పుడు, బయటి నుంచి ఇంటికి వచ్చేటప్పుడు గల్లీలో వాటర్ ట్యాంకర్ నిలిపి ఉంటే ద్విచక్ర వాహనం కూడా వెళ్లే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

హాస్టళ్ల నిర్వాహకులు చొరవ తీసుకోవాలి

వసతి గృహాలకు నీరు సరఫరా చేసేందుకు ట్యాంకర్లు ప్రతిరోజూ పదుల సంఖ్యలో గల్లీల్లోకి వస్తున్నాయి. ఆయా మార్గాల్లో వాహనాల పార్కింగ్ వల్ల ట్యాంకర్ డ్రైవర్లు కష్టాలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. వసతి గృహాల నిర్వాహకులు తమ గల్లీలోకి వాటర్ ట్యాంకర్ వచ్చే సమయంలో ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఆయా హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశమై హాస్టళ్ల బయట రోడ్లపై బైక్‌లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమించే వారికి ఫైన్ విధించాలని పలువురు కోరుతున్నారు.

ఇతరులకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేయాలి

వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అయితే ప్రత్యేక దృష్టి పెడతాం. వాహనాలను స్టేషన్‌కు తరలించి ఫైన్లు వేస్తాం. గల్లీలో ఇక్కడ కారు పార్కింగ్ చేశారు.. అక్కడ బైక్ పార్కింగ్ చేశారు.. అక్రమ పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్నాం అని అంటే మేము ఏం చేస్తాం. స్థానికంగా ఉండే వారు ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాహనాలను పార్కింగ్ చేసుకుంటే మంచిది. ఎక్కడైనా పదేపదే సమస్య తలెత్తుతుంటే మాత్రం ఆకస్మికంగా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

- జానయ్య, ఎస్‌హెచ్ఓ, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్.

కూకట్‌పల్లికి రూ.25 కోట్లు మంజూరు చేయండి

- హైదర్‌నగర్ సర్వే నం. 145,163లో భవన నిర్మాణానికి అనుమతులివ్వండి
- సాయినగర్‌లోని ఇళ్లను క్రమబద్ధీకరించండి
- సీఎంకు ఎమ్మెల్యే కృష్ణారావు విజ్ఞప్తి



సీఎం రేవంత్‌రెడ్డికి కూకట్‌పల్లి సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయని, అభివృద్ధి పనులు చేపట్టేందుకు తక్షణం రూ. 25 నుంచి 30 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కూకట్‌పల్లిలోని సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. నిధులు లేకపోవడంతో నూతన రోడ్లు, తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి పైప్‌లైన్లు పార్కులు, శ్మశానవాటికలకు సంబంధించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో 70 శాతం వరకు పూర్తయిన పనులు నిధుల కొరతతో ముందుకు సాగడం లేదన్నారు. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నంబర్ 145,163 అకస్మాత్తుగా భవన నిర్మాణ అనుమతులను నిలిపివేశారని, ఈ విషయంపై మున్సిపల్ అధికారులను సంప్రదిస్తే రెవెన్యూ అధికారుల పేరు చెప్తున్నారని, వారి వద్దకు వెళ్తే మున్సిపల్ అధికారుల పేరు చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ నిర్మాణాల అనుమతులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టలేదన్నారు. జేఎన్‌టీయూ వెనుక ఉన్న సాయినగర్ కాలనీవాసులు ఇళ్ల క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు. 2014 ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించేందుకు కాలనీవాసులు సిద్ధంగా ఉన్నారని వివరించడంతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కార్పొరేటర్ పరామర్శ

అల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌లో గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అల్లాపూర్ వాసులు భూపాల్ కుటుంసభ్యులను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగం బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన మల్లమ్మ కుటుంబ సభ్యులను కూడా ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో నాగుల సత్యం, సత్యనారాయణ, ఏసురత్నం, నరసింహ పాల్గొన్నారు



భూపాల్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సబీహా బేగం



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వివేకానందనగర్‌లో 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'

హైదర్‌నగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని పార్కు-2లో బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులకు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం మొత్తం ఒకేసారి ఎలక్షన్ విధానం, దాని వలన కలిగే ప్రయోజాలను వారు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ ఎన్. వంశీరెడ్డి, నరసింహచారి, నర్సింగ్‌రావు, రెప్పన్‌రాజు పాల్గొన్నారు.

మియాపూర్ చెరువులకు మహర్దశ

- కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులతో చెరువులను అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పటేల్‌చెరువు సుందరీకరణ పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని గుర్నాథంచెరువు తరహాలో మిగతా చెరువులను కూడా పునరుద్ధరణతో దశదిశ మారుస్తామన్నారు. చెరువులను సుజల నీటితో నింపుతామన్నారు

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో. రూపాయల్లో) ఇలా ఉన్నాయి... టమోటా కేజీ 11, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 28, కాకర 35, బీర 28, క్యాబేజీ 12, బీన్స్ 45, క్యారెట్ 23, గోబి పువ్వు 18, దొండ35, చిక్కుడు 50, గోరు చిక్కుడు .35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 35, ఆలు 23, కీర 15, కంద 65, ఉల్లి 24, చామగడ్డ 40, చిలగడ దుంప 30. గురువారం ఉదయం 9.30 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

- 15 పదవులు .. 36 మంది పోటీ

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 720 మంది ఓటర్లు ఉన్నారు. 15 పదవులకు 36 మంది పోటీ పడుతున్నారు. అధ్యక్ష పదవికి ఇద్దరు తాజా, మాజీ అధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి, జి.శ్రీనివాసరెడ్డిలతో పాటు సీనియర్ న్యాయవాది కె.కృష్ణవేణి పోటీలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఐదుగురు పోటీలో ఉండగా.. ఎం. కాశీ శ్రీనివాస్ సింగ్, డి.మల్లేష్, సి. శ్రీకాంత్, ఎ. సుదర్శన్‌రెడ్డితో పాటు మహిళా న్యాయవాది కె. రాధిక రాగా మంజరి పోటీ పడుతున్నారు. గత రెండు నెలలుగా పోటీ చేసే వారు ఆత్మీయ సమ్మేళనాలతో మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేశారు. ఏడాది కాలపరిమితి ఉండే ఈ పోస్టుల్లో విజయం సాధించేందుకు సాధారణ ఎన్నికల మాదిరిగా ప్రచారం చేశారు.

పార్కు ముందు చెత్తను తొలగించరూ!

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని బతుకమ్మకుంట పార్కు ప్రవేశ ద్వారం వద్ద రోజుల తరలబడి చెత్తాచెదారం పేరుకుపోవడంతో పార్కుకు వచ్చే వారితో పాటు అక్కడ వాహనాలను పార్కింగ్ చేసేందుకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా ఉన్న ట్రినిటీ చర్చికి ఆదివారం ప్రార్థనలకు వచ్చేవారు కూడా చెత్త కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు ఇక్కడ రోజూ చెత్తను తెచ్చి పడేస్తూ డంపింగ్ కేంద్రంగా మారుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు, ప్రార్థనా మందిరం వద్ద చెత్తాచెదారం పడేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.



పార్కు గేటు ముందు పేరుకుపోయిన చెత్తాచెదారం



బాండ్లు అందుకున్న జంటలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు

కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు 'బాండ్లు' అందజేత

కూకట్‌పల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం అందజేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న మూడు జంటలు.. మధుకర్ (బాలానగర్), లోకేష్ (కూకట్‌పల్లి), సాయిప్రదీప్ (ప్రశాంత్‌నగర్)లకు రూ.2.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ పాండు, వి.కొండల్‌రావు, వి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.



బోరు మోటార్‌ను మార్పిస్తున్న కార్పొరేటర్ మహేందర్

సీఎస్ఆర్ నిధులతో బోరు మోటారు బిగింపు

కూకట్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద నీటి సమస్యను పరిష్కరించామని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తెలిపారు. హమాలీ యూనియన్ ఆఫీస్ వద్ద బోరు మోటర్ పాడైపోవడంతో మరమ్మతులు చేయించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు హమాలీలు విజ్ఞప్తి చేస్తే నిధులు లేవని చెప్పారు. బోరు పని చేయకపోవడంతో హమాలీలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ మహేందర్‌కు సమాచారంఅందింది. వెంటనే ఆయనఓ ప్రైవేట్ కంపెనీతో మాట్లాడి, ఆ కంపెనీ ఇచ్చిన సీఎస్ఆర్ నిధులతో నూతన మోటార్‌ను తెప్పించి బిగించారు. తమ నీటి సమస్యలను పరిష్కరించినందుకు హమాలీలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య, శివరాజ్ యాదవ్, కిషోర్, కృష్ణాయాదవ్ పాల్గొన్నారు.

నేడు కేపీహెచ్‌బీలో రక్తదాన శిబిరం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ రోడ్డులోని కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని పోచమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆలిండియా రామ్‌చరణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. సినీనటుడు రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు సందీప్ ధనపాల, అరవింద్ చెర్రీ ఓ ప్రకటనలో తెలిపారు.



మంత్రి సీతక్కతో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, ప్రతినిధులు

ప్రభుత్వం అనుమతిస్తే శిక్షణ ఇస్తాం : రామేశ్వర్ రావు

రాయదుర్గం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో బుధవారం స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే రాష్ట్రంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదలశాఖలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్న అధికారులకు కూడా శిక్షణ ఇస్తామని గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్ రావు అన్నారు. ఈమేరకు బుధవారం రామేశ్వర్‌రావు, ప్రతినిధులు మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రామేశ్వర్‌రావు తెలిపారు. ఈ ట్రైనింగ్‌కు ఏడాదికి రూ.12 కోట్లు ఖర్చవుతుందని, మొదటి దశ కింద 20 జిల్లాలో బ్యాచ్‌కు 60మందికి చొప్పున ఒక్కో జిల్లాలో 5 ట్రైనింగ్‌సెంటర్లను నిర్వహిస్తామని రామేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌కు రావాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ముస్లిం మత పెద్దలు

ఇఫ్తార్ విందుకు ఆహ్వానం

హైదర్‌నగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం కార్పొరేటర్, ముస్లిం పెద్దలు మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీపీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, షౌకత్ అలీమున్నా, సయ్యద్, ఇస్మాయిల్, సుల్తాన్, షబ్బీర్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ కమిటీ

భూముల రక్షణకు సహకారం అందించండి

రాయదుర్గం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు, తాము చేస్తున్న పోరాటానికి తమ మద్దతు తెలియజేసి భూములను రక్షించేందుకు సహకారం అందించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ, వర్సిటీకి చెందిన కంచె భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే అక్కడి జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు పూర్తిచేసుకుంటున్నా ఇప్పటికీ యూనివర్సిటీకి భూములను వర్సిటీకి చెందినవిగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్స్ చేయించలేదని వారికి చెందిన భూములను వారికే అప్పజెప్పాలని కోరారు. తక్షణమే నిర్మాణాలు నిలుపుదల చేయాలని, విద్యార్థుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని అఖిల భారతస్థాయిలో తమ పార్టీ ఎంపీలతో కేంద్ర మంత్రుల దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ, తమ ఆందోళనను దేశంలోని అన్ని వర్సిటీలకు విస్తరిస్తామని తెలిపారు.



డీజీఎం శేషగిరిరావుకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ కార్మికులు

ఐలా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్ ఇండస్ట్రీ ఐలా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జోనల్ కమిషనర్, జోనల్ మేనేజర్ నానక్‌రాంగూడ వైఎస్ఆర్ భవన్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ హాజరై మాట్లాడుతూ, రాజేంద్రనగర్ కాటేదాన్ ఇండస్ట్రీ ఏరియాలో అనేక ఏళ్ల నుండి పనిచేస్తున్న శానిటేషన్ ఇండస్ట్రియల్ ఐలా కార్మికులకు రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదని, ఐలా కార్యాలయం ముందు ప్ల కార్డ్ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం నాక్‌రాంగూడలోని వైఎస్ఆర్ భవన్ దగ్గరికి చేరుకుని ధర్నా నిర్వహించారు. జోనల్ కమిషనర్ శారద, డీజీఎం శేషగిరిరావుకు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు ప్రవీణ్‌కుమార్, రమేష్, బాబు, చంద్రకళ, రామచందర్, శైలజ, లక్ష్మమ్మ, రమ, ఉమా, వేణు, ప్రమీల, అశోక్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి

వివేకానందనగర్‌లో 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'

హైదర్‌నగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని పార్కు-2లో బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులకు 'వన్ నేషన్ - వన్‌ఎలక్షన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం మొత్తం ఒకేసారి ఎలక్షన్ విధానం, దాని వలన కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ ఎన్.వంశీరెడ్డి, నరసింహచారి, నర్సింగ్‌రావు, రెప్పన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు చిట్టడివి.. నేడు ఉద్యానవనం

- 10 వేల రకరకాల మొక్కలు, 26 రకాల పూల మొక్కలతో ఆహ్వానం
- కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్న హఫీజ్‌పేట్ హుడా జయశంకర్ సారు పార్కు



పిచ్చిమొక్కలు, బండరాళ్లు

చందానగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): నాడు చిట్టడివి.. నేడు ఆహ్లాదాన్ని పంచే అరణ్యం. ఒకప్పుడు పాములు, విష జంతువులు సంచరిస్తూ భయంభయంగా ఉండే చందానగర్ సర్కిల్ హఫీజ్‌పేట్ డివిజన్ హుడా జయశంకర్ పార్కు ఇప్పుడు ఎటూ చూసినా పచ్చదనం.. పూల, ఔషధ మొక్కలతో అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం మూడెకరాల భూవిస్తీర్ణంతో 10 వేల మొక్కలు, చెట్లు, 25 రకాల పూల మొక్కలు, ఔషధ మొక్కలు, పార్కులో యోగా కోసం స్టేజీ, చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో వృద్ధులు, చిన్నారులు పార్కులోకి వస్తుంటారు. నిరుపయోగంగా ఉన్న ఈ స్థలంలో ఎత్తయిన బండరాళ్లను తొలగించి చదును చేసి ఉపయోగంలోకి తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. 2017లో కాలనీవాసులు పార్కు అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకొని బండరాళ్లను తొలగించి పార్కు అభివృద్ధికి నడుం బిగించారు. ఏడేళ్ల సమయంలో పార్కులో 10వేల మొక్కలు, చెట్లను పెంచి పలువురికి ఆదర్శంగా నిలిచింది జయశంకర్ సారు పార్కు. అసోసియేషన్ కోసం బిల్డింగ్ నిర్మించుకుని, పిల్లలకు ఆటవస్తువులు, పెద్దలకు గ్రంథాలయం భవనం కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం నిత్యం ఉదయం, సాయంత్రం 1000 మంది నుంచి 2,500 వరకు ప్రజలు పార్కును సందర్శిస్తారు. పార్కు చుట్టూ 30 విద్యుత్ దీపాలు, 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఎంతో అనుభూతినిస్తుంది



పార్కు పచ్చదనంతో విరజిల్లుతుంది. పచ్చని చెట్ల మధ్య నుంచి వాకింగ్ చేస్తుంటే ఎంతో అనుభూతి కలుగుతుంది. నిత్యం ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తా. సమయం ఉంటే యోగా చేస్తా.

- జనార్థన్, చందానగర్

సహకారం అందిస్తున్నాం

గతంలో పార్కు నిరుపయోగంగా ఉండేది. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని కాలనీ వాసులు, పార్కు అసోసియేషన్ సభ్యులు వినతి పత్రాలు అందజేశారు. పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను తీసుకున్నాం. ఇంకా అభివృద్ధి చేయడానికి మావంతు కృషి చేశాం.

- పూజిత జగదీశ్వర్‌గౌడ్, హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్



పచ్చదనంతో నిండిపోయిన పార్కు



ఆడుకుంటున్న చిన్నారులు

మరింత అభివృద్ధి చేస్తాం

ప్రజలకోసం హుడా కాలనీ ఫేజ్-2లో మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. అందులో బండరాళ్లు, విష జంతువులు, పిచ్చి మొక్కలతో అసాంఘీక కార్యాకలాపాలకు అడ్డాగా ఉండేది. ఎత్తుగా ఉన్న బండరాళ్లను తొలగించాం. దాతల సాయంతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నాం. రీడర్స్ సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. నిత్యం సుమారు 600-800 మంది వాకింగ్, వ్యాయామం, యోగా, చిన్నారులు ఆటల కోసం వస్తుంటారు.

- రాజేష్‌గౌడ్, పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు



సంక్షేమ పథకాలకే అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

భెల్‌కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ కాలనీని అభివృద్ధి పరుస్తున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలో భారతీనగర్ డివిజన్ ఎంఐజీ కాలనీలో రూ.98.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వరదనీటి కాలువ నిర్మాణ పనులకోసం డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఐజీకాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లపై ప్రత్యేక శ్రద్ధవహించి వాటిని తిరిగి నిర్మించామని, 90శాతం పనులు పూర్తిచేశామన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించామన్నారు. దాదాపు కోటి రూపాయలతో చేపట్టనున్న పనుల వల్ల వరదనీటి ముంపు ప్రాంతాల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, కాలనీ నాయకులు, బూన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



వరదనీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

మా కాలనీల్లో హాస్టళ్లు వద్దు

శ్రీరాంనగర్, ఏబీసీ కాలనీల కమిటీ డిమాండ్

గచ్చిబౌలి, మార్చి26 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శ్రీరాంనగర్, ఏబీసీ కాలనీల్లో విచ్చల విడిగా పీజీ హాస్టళ్లు వెలిశాయని వాటివల్ల తమ పిల్లలు పాడవుతున్నారని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హాస్టళ్ల యాజమాన్యంపై చర్యలుతీసుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేసింది. ఇక్కడ ఓయో రూమ్స్ విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిటీ విజ్ఞప్తిచేసింది. కాలనీల మధ్యలో ఇలాంటి పీజీ హాస్టళ్లను నిర్వహించడం పట్ల కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో శ్రీరాంనగర్ ఏబీసీ బ్లాకుల సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు కాలనీ వాసులు సుమారు 100 మంది పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ

తాగునీటి వృథా.. నిర్లక్ష్యమేలా..?





గోపన్‌పల్లి ఫ్లైఓవర్ మార్గంలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

రాయదుర్గం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం.. అందులోనూ నీటి ఎద్దడితో ప్రజలు ఇక్కట్లు పడుతుండగా, అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో ఎంతో విలువైన తాగునీరు వృథా అవుతోంది. గచ్చిబౌలి డివిజన్ గోన్‌పల్లి తండా ఫ్లైఓవర్ మార్గంలో మంచినీటి పైపులైను లీకేలతో తాగునీరు రోడ్డు పాలవుతోంది. సుమారు పది రోజుల నుంచి ఇలా తాగునీరు రోడ్డు పాలవుతున్నా పట్టించుకునే వారే లేరు. తాగునీటి సరఫరా సక్రమంగా పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి లీకేజీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌నగర్, తాజ్‌నగర్, గౌలిదొడ్డి, కేశవనగర్, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, మధురానగర్, ప్రశాంత్ హిల్స్, రాయదుర్గం, టెలికాంనగర్, ఇందిరానగర్‌లో ప్రజలకు సరపడా తాగునీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వెంటనే సిబ్బందిని పంపించి పైపులైన్లు లీకేజీలను అరికడతాం. అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా వాటర్ సప్లయ్ సరిగా జరగని ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలిస్తాం. పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తాం.

- అభిషేక్, నల్లగండ్ల డివిజన్ వాటర్‌వర్క్స్ మేనేజర్

కారు కొన్న నాలుగు రోజులకే బ్రేక్‌డౌన్

- షోరూం వద్ద వినియోగదారుడి ఆందోళన
- నిర్వాహకులతో వాగ్వాదం

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కారు కొన్న నాలుగు రోజులకే బ్రేక్ డౌన్ అయిందని షోరూంకు తీసుకువస్తే వినియోగదారుడిపైనే దాడి చేసిన ఘటన మాదాపూర్‌లో జరిగింది. బాధితుడు సామల రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని తేజస్విని టాటా మోటార్స్‌లో అక్టోబర్ 10న టాటా సఫారి కారు కొన్నాడు. కొన్న 10 రోజుల్లోనే బ్యాటరీ ఫెయిల్యూర్‌తో కారు ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 5 సార్లు కారు ఆగిపోయింది. సర్వీసుకు ఇచ్చినప్పుడల్లా వారం పదిరోజులు ఉంచుకుని ఇస్తున్నారు తప్ప కారులో ఉన్న లోపాన్ని సరిదిద్దడం లేదు. ఈ కారు డిఫెక్ట్‌తో ఉందని, దీన్ని తీసుకొని కొత్త కారు ఇవ్వాలని, లేదంటే డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే దానికి షోరూం నిర్వాహకులు అదనపు వారంటీ ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప, ఎలాంటి గ్యారెంటీ ఇవ్వడం లేదని బాధితుడు వాపోయాడు. ఇలాంటి కారుతో తాను బయటికి వెళ్లలేకపోతున్నానని, కొత్త కారు ఇలా కావడం ఏంటని అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండా తనపై దౌర్జన్యం చేస్తున్నారని, షోరూం నుంచి బయటకు పంపిస్తున్నారని కారు యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. షోరూం నిర్వాహకులు తన సమస్యను పరిష్కరించకపోవడంతో తన కారుకు బ్యానరు కట్టి షోరూం ముందు నిలబడి తాను కారు కొనుగోలు చేసిన తర్వాత ఎదురైన సమస్యలను, అనుభవాలను పేర్కొంటూ నిరసన తెలిపాడు. దీంతో షోరూం ముందు వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న మాదాపూర్ పోలీసులు అక్కడికి చేరుకొని కారు యజమాని, షోరూమ్ నిర్వాహకులతో మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చేశారు.

బాలిక అదృశ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఓ బాలిక (16) ఆచూకీని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో నివాసముంటూ చెత్త ఏరుకొని జీవనం సాగిస్తున్న దంపతులకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా, ఈనెల 24న తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తె అదృశ్యం కావడంలో ఓ యువకుడి ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ కనుగొన్న పోలీసులు కుటుంబసభ్యులను, యువకుడితో పాటు బాలికను బుధవారం స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. సదరు యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

అల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌లో ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన అల్లాపూర్ వాసులు భూపాల్ కుటుంసభ్యులను కార్పొరేటర్ సబీహా బేగం బుధవారం పరామర్శించారు. మృతి చెందిన మల్లమ్మ కుటుంబ సభ్యులనూ పరామర్శించారు.

ఘనంగా దావత్-ఏ- ఇఫ్తార్

చందానగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని, నిష్ఠతో ఉపవాస దీక్షలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో దావత్-ఏ- ఇఫ్తార్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను వివరించారు. అనంతరం ముస్లింలకు పండ్లు, మిఠాయి తినిపించారు.

సుభాష్ చంద్రబోస్ నగర్‌లో..

హైదర్‌నగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, పండుగ మతసామరస్యానికి ప్రతీకని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో ఎస్‌కె బీబీ ఆధ్వర్యంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్ వెంకటేష్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి

- భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

భెల్‌కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలో గల బీహెచ్ఈఎల్ ఎంఐజీకాలనీ ఫేజ్-1 ప్రధాన సెంటర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాదాచారులు, వాహనదారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు, యువజన సంఘాలు, సమాజాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని, సేవాకార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సర్కిల్ అధ్యక్షురాలు రాణి యాదవ్, నాయకులు సత్యనారాయణ, సురేందర్, దేవేంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ పటేల్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్ చెరువులకు మహర్దశ

- కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులతో చెరువులను అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పటేల్‌చెరువు సుందరీకరణ పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని గుర్నాథంచెరువు తరహాలో మిగతా చెరువులను కూడా పునరుద్ధరణతో దశదిశ మారుస్తామన్నారు. చెరువులను సుజల నీటితో నింపుతామన్నారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉండే వారు సేద తీరేలా ఆహ్లాదకర వాతావరణం అందిస్తామని పేర్కొన్నారు. చెరువు చుట్టూ ప్రత్యేకంగా నిర్మించే మురుగు కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్ధరణ, వాకింగ్ ట్రాక్ వంటి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆనంద్ మల్లిగవాడ్, సభ్యులు రామ్, చైతన్య పాల్గొన్నారు.



లింగంపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవియాదవ్

చలివేంద్రం ప్రారంభం

గచ్చిబౌలి, మార్చి26 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో చలివేంద్రాలు బాటసారులకు, కార్మికులకు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని ఎంఆర్‌వై ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవి యాదవ్ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని లింగంపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా, మసీదు బండగ్రామం, గుల్‌మోహర్ కాలనీ చౌరస్తాలో ఎంఆర్‌వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చలివేంద్రాలలో మొదటి రోజు మజ్జిగ అందిస్తామని అన్నారు. వేసవి కాలం మూడు నెలలు నిత్యం ప్రజలకు తమ చలివేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తాయన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుండిగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం స్థలం కేటాయించకపోవడం వల్ల బహదూర్‌పల్లిలో ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ కళాశాల స్థలంలోనే తాత్కాలికంగా డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. దీంతో ఇటు డిగ్రీ, అటు ఇంటర్ విద్యార్థులకు విద్యను అభ్యసించే విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం దీనిపై సమగ్ర సమాచారం పరిశీలించాలని, హెచ్ఎండీఏ పరిధిలో 110 ఎకరాల్లోని హెచ్ఎంటీ స్థలంలో 5 ఎకరాలను కేటాయించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులతో వేటినైనా ఉపయోగించుకుని కళాశాల నిర్మాణాన్ని చేపట్టవచ్చన్నారు. ఈ కళాశాల ఏర్పాటుతోనైనా విద్యార్థులకు న్యాయం చేసినట్టు అవుతుందని వివేకానంద్ కోరారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌తో బెనిఫిట్


గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం రూ.1200ల వరకు ఆస్తి పన్నులు చెల్లించే వారికి అప్పటి ప్రభుత్వం రూ .101 లు చెల్లిస్తే సరిపోయేలా జీఓ తీసుకువచ్చిందన్నారు. అయితే మొదట్లో రూ.101లను చెల్లించిన యజమానులు 15 నుంచి 20 సంవత్సరాలుగా చెల్లించకపోవడంతో తొమ్మిది వేల మందికి పైగా పన్నులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో వారందరూ రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఫెనాల్టీతో పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీంలో రాయితీతో పన్ను చెల్లిస్తే చాలా తక్కువతో సరిపోతుందన్నారు. ఒకవేళ మార్చి 31వ తేదీ దాటితే మరో సారి ఫెనాల్టీతో చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

● దుండిగల్‌లో


దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్

దుండిగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుకు ఓటీఎస్‌ను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ఈ అవకాశం మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. బకాయిదారులు పన్ను మొత్తం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఇప్పటివరకు బకాయిలను వడ్డీతో సహా చెల్లించిన వారికి వడ్డీపై 90 శాతం మాఫీ చేసిన చెల్లింపులో రాబోయే ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ ట్యాక్స్ కింద సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. దుండిగల్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.


సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీలను అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.వి జయశేఖర్ గౌడ్ అన్నారు. గాజులరామారంలోని బాలయ్యనగర్‌కు చెందిన కొరవర నర్సమ్మ, రంగారెడ్డినగర్‌కు చెందిన కేశవ్‌పట్ల అరులప్ప అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఆయన ఇరువురికి రూ.2 లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎల్ఓసీలను మంజూరు చేయించారు. చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసీలను కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు శంకరయ్య, విజయరాంరెడ్డి, నాయకులు కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, బాలయ్యనగర్ కాలనీ అధ్యక్షులు నాగేష్ పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్‌పై కౌన్సెలింగ్


హెల్మెట్ బహూకరిస్తున్న సీఐ శ్రీనివాస్

గాజులరామారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం చౌరస్తాలో మంగళవారం రాత్రి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. అయితే ఓ వాహనదారుడిని నిలిపి తనిఖీ చేయగా 67 చలాన్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో హెల్మెట్ లేకుండా 51, ట్రిబుల్ రైడింగ్‌లు 5, రాంగ్‌రూట్ డ్రైవింగ్ 10, వాక్‌వే ఆటంకానికి ఒక చలాన్ ఉన్నట్లు తెలిపారు. పోలీసులు వినూత్నంగా హెల్మెట్ లేకుండా ఉన్న 51 చలాన్లను రద్దు చేసి అతడికి హెల్మెట్‌ను బహుమతిగా అందజేశారు. సురక్షిత డ్రైవింగ్‌లపై కౌన్సెలింగ్ చేయించి పంపించారు. వాహనదారుల్లో మార్పు రావాలనే దృష్టితో ట్రాఫిక్ పోలీసులు చలాన్లను రద్దు చేసి కనువిప్పు కలిగేలా నూతన హెల్మెట్‌ను వాహనదారుడికి బహూకరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా అందోని గ్రామానికి చెందిన బండి ఈరన్న(35) ఉపాధి నిమిత్తం ఆరు నెలల క్రితం కొంపల్లిలోని దూలపల్లి గ్రామానికి వచ్చి నివసిస్తూ, సూర్య అనే అతడి వద్ద ఆటోను కిరాయికి తీసుకొని నడుపుకొనేవాడు. ఆటో నడుపగా వచ్చిన డబ్బులు సూర్యకి ఇచ్చేవాడు. ఈరన్న రెండురోజుల నుంచి డబ్బులు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన ఆటో యజమాని అతడి కోసం వెతికాడు. జీడిమెట్లలోని అమ్మవారి దేవాలయం సమీపంలో సర్వీస్‌రోడ్డులో ఆటో పార్కు చేసి ఉంది. ఆటో వెనక సీటులో ఈరన్న పడి ఉన్నాడు. అతడి ముక్కు నుంచి రక్తం కారి, ఎడమకాలికి గాయమై ఉంది. ఆటో యజమాని, కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● నీటి వృథాను అరికట్టేలా చర్యలు

● లీకేజీలకు సత్వర మరమ్మతులు

● ఫిల్లింగ్ పాయింట్లు పెంచే ఏర్పాట్లు


షాపూర్‌నగర్ ఓవర్‌హెడ్ ట్యాంక్


ఆర్‌సీసీ రిజర్వాయర్

షాపూర్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవి తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు రక్షణ మంచినీటి విభాగం ముందస్తు కార్యాచరణను చేపట్టింది. క్షేత్రస్థాయిలో నీటి సరఫరా పరిస్థితులను తెలుసుకొనేందుకు కాలనీలు, బస్తీల వారీగా సిబ్బందిని రంగంలోకి దించారు. గ్రిడ్ నుంచి గ్రామాల వరకు సరఫరా అయ్యే పైపులైన్లు, ట్యాంకులు, లీకేజీలు, మోటార్ రిపేర్లను మిషన్ భగీరథ యంత్రాంగం పర్యవేక్షిస్తున్నది. గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో అంతర్గత నీటి సరఫరా విధానాన్ని తెలుసుకొనేందుకు సిబ్బందిని ఏర్పాటుచేశారు. వేసవిలో పెరిగిన నీటి ఎద్దడిని అధిగమించేందుకు కార్యాచరణను రూపొందించినట్లు జలమండలి అధికారులు చెపుతున్నారు. నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా అన్ని సమస్యలపై కసరత్తు చేస్తున్నారు. బుక్ చేసుకున్న 24గంటల్లోనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వేసవిలో లీకేజీల ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యత తీసుకుంటున్నారు.

కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో నీటిఎద్దడిని అధిగమించేందుకు ఐదు సెక్షన్ల అధికారులు, సిబ్బంది పకడ్బందీగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెపుతున్నారు. షాపూర్‌నగర్, చింతల్, గాజులరామారం, సూరారం, సుచిత్రా, జగద్గిరిగుట్ట సెక్షన్లలో వేసవి దాహార్తిని అధిగమించేలా అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నామని తెలిపారు. నీటి ట్యాంకర్ల సంఖ్యను పెంచడం, వాటర్ ఫిల్లింగ్ పాయింట్స్‌ను పెంచడం జరుగుతుందన్నారు. డొమెస్టిక్ ట్యాంకర్ రూ.500లు, కమర్షియల్‌కి రూ.850రూపాయలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు.

హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలోనే సమస్యలు

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మణపురం ఫిల్టర్ పాయింట్, హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి 65ఎంఎల్‌డీల సరఫరా జరగాల్సి ఉండగా కేవలం 35ఎంఎల్‌ల నీటినే విడుదల చేస్తున్నారు. దీంతో మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. 35 ఎంఎల్‌డీల నీటిని స్థానికంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు అదనంగా నీటిని సప్లై చేయడం ద్వారా ఇతర ప్రాంతాలకు నీటి కొరత తలెత్తుతుంది. పైఅధికారులు సమస్యలను సకాలంలో గుర్తించి సక్రమంగా నీటిని సరఫరా జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



మాజీమంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నీటిఎద్దడిని అధిగమించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టులో భాగంగా రూ.220కోట్లతో 2016 జనవరి 4న అప్పటి హోంమంత్రితో కలిసి మాజీ పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పనులకు షాపూర్‌నగర్ జలమండలి కార్యాలయంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో తాగునీరు లేని కాలనీలు, బస్తీలకు పైపులైన్లు విస్తరించడం, మూడు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వడమే పథకం ఉద్దేశం. పనులు పూర్తయ్యాయి. తాగునీటి సమస్యను దాదాపుగా తీరిందనే చెప్పాలి.

తాగునీటి సమస్యలేదు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు తాగునీటి సమస్య లేదని షాపూర్‌నగర్ జలమండలి డీసీఎం రవి తెలిపారు. పరిశుభ్రమైన, నాణ్యమైన తాగునీటిని కాలనీలు, బస్తీలకు సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణమే సమస్య పరిష్కారదిశగా పనిచేస్తున్నాము. లీకే జీలు, నీటివృధాను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. మా దృష్టికి రాని సమస్యలు ఏమైనా ఉంటే వినియోగదారుల ఫిర్యాదు మేరకు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. - రవి, జలమండలి డీసీఎం, షాపూర్‌నగర్

నీటి సరఫరాను మెరుగుపరుస్తాం

● జలమండలి డైరెక్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి డైరెక్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్

పేట్ బషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నీటి సరఫరా మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని జలమండలి డైరెక్టర్ ఎల్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశాన్ని నిర్వహించి వేసవి ప్రణాళికపై వ్యూహరచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జూన్ చివరి వరకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. లీకేజీ ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని, వాటర్ ట్యాంకర్ల వెయిటింగ్ లిస్ట్, ఫిల్లింగ్ పాయింట్లలో సమయ పాలన పాటించాలని సూచించారు. ఫిల్లింగ్ పాయింట్లను నూతనంగా ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని అదనపు పాయింట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కుత్బుల్లాపూర్‌లో ఉన్న నీటి ట్యాంకర్లతో పాటు మరో 15 ట్యాంకర్లను సమకూర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిన వాటి వద్ద మరో 10 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని ట్యాంకర్లను బుక్ చేసుకున్న వారికి త్వరగా సరఫరా చేసేలా చూడాలన్నారు. గాజులరామారంలో అదనంగా మరో ఫిల్లింగ్ ఏర్పాటు చేస్తే నీటి సరఫరా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం నారాయణ, జీఎం అశోక్, డీజీఎంలు రాజేష్, రవి, వికాస్, మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.


సారెగూడెంలో చిన్నగంగన్న కుంటను మట్టితో పూడ్చి నిర్మించిన గేదెల కొట్టం

చిన్న గంగన్న కుంటను పరిరక్షించాలి

దుండిగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ రెవిన్యూ పరిధి సారెగూడెం గ్రామ శివారులో చిన్నగంగన్న కుంటను స్థానికులు మట్టితో పూడ్చి చదును చేస్తున్నారు. గతంలో ఇద్దరు వ్యక్తులు మట్టిని తీసుకువచ్చి కుంటను సగం వరకు పూడ్చారు. దీంతోపాటు ఒక వ్యక్తి ఏకంగా ఒక దొడ్డ కొట్టం కూడా నిర్మించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇక్కడే మరో కొట్టాన్ని నిర్మించడానికి వేరొక వ్యక్తి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎకరం దాదాపు రూ.5 కోట్ల విలువ చేస్తుంది. కాబట్టి ఆ కుంటను పూడ్చి విక్రయించాలనే ఉద్దేశంతో ఆ వ్యక్తులు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ గ్రామానికి చెందిన మురుగు ఈ చిన్నగంగన్న కుంటలో చేరుతుంది. ప్రస్తుతం చెరువుకు అడ్డుగా మట్టిని నింపి పూడ్చడం వల్ల గ్రామం నుంచి వచ్చిన నీరంతా రోడ్డుపై ఏరులై పారుతుంది. దీనివల్ల ఆ ప్రాంత నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు. కాబట్టి గండిమైసమ్మ, దుండిగల్ రెవిన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించాలని, కుంటను పూడ్చుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కుంటను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎండలో ప్రయాణికులు

పేట్‌బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 44లో ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని బస్‌స్టాప్‌లను తొలగించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి నుంచి వేలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కొంపల్లి ప్రాంతంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు ఉపాధికోసం వస్తుంటారు. జాతీయ రహదారి 44లో ఉన్న సుచిత్ర నుంచి కొంపల్లి వరకు ఏ బస్‌స్టాప్ చూసినా ప్రయాణికులతో కిటకిటలాడుతుంటాయి. దూలపల్లి, మైసమ్మగూడ, కొంపల్లి ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకొని కూర్చోడానికి బెంచీలు లేకున్నా తాత్కాలిక బస్‌షెల్టర్లను ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్‌స్టాప్‌లో నిలబడిన ప్రయాణికులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీలో చెరువు సుందరీకరణ, మురుగునీటి పైపులైను పనులకు రూ. 10 కోట్ల నిధులు కేటాయించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్‌కు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో కలసి స్థానిక నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పురపాలక సంఘంలోని పీఎంఆర్ ఎన్‌క్లేవ్ నుంచి ఫామ్ విడోస్, శాంతినగర్ కాలనీ, అపర్ణ ఫామ్‌గ్రోస్, సెప్టెక్‌ట్యాంక్ వరకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ; మైకసా స్టెర్లింగ్ రోడ్డు నుంచి అవని గార్డెన్స్ రోడ్డు వరకు; నోముల్స్ నిర్వహణ నుంచి అపర్ణా ఫామ్‌తో పాటు జయభేరికాలనీ, ఓల్డ్‌గోదాం రోడ్డు, సెంట్రల్ పార్కు ప్రాంతాల్లో మురుగు నీటి పైపులైను, సీసీ రోడ్లు, చెరువు సుందరీకరణ కోసం రూ.10కోట్ల నిధులను మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బి.ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి నాగమణి దేవేందర్, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డిలు ఉన్నారు.


దాన కిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

సమస్యల పరిష్కారానికి కృషి

షాపూర్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు ఆయనను కలసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేరుకుపోయిన చెత్త

పడకేసిన పారిశుధ్యం

షాపూర్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సూరారం, గాజులరామారం డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోయి స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారింది. సకాలంలో పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పీసరి కృష్ణారెడ్డితో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్రూం వాసులు

సమస్యల పరిష్కారానికి వినతి


దుండిగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్రూం కాలనీ వాసులకు సౌకర్యాలు కల్పించాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆదేశాలతో మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి కమిషనర్ వెంకటేశ్వర నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్రూం సముదాయంలోని 3, 5, 8 బ్లాకుల్లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో పంపుసెట్లతో కూడిన మూడు బోర్లు కలెక్టర్ నుంచి మంజూరయ్యాయని, పనులను వెంటనే ప్రారంభించి ప్రజలకు నీరందించాలని వారు కోరారు. ఈ విషయమై త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ వారికి హామీనిచ్చారు.


గుంతల రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్ విజయ్‌శేఖర్ గౌడ్

అంతర్గత రోడ్ల పరిశీలన

పేట్‌బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని వెంకట్రామిరెడ్డినగర్, గాంధీనగర్, రంగారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆయనకు తెలిపారు. దీంతో ఆ ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు మంజూరైన నిధులతో రోడ్లను వేయించాలని విజయ్‌శేఖర్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధాకర్, బాల్‌రాజ్, వెంకటేశం, యాదవరెడ్డి, వెంకటేశం, వర్కు ఇన్‌స్పెక్టర్ కిషోర్‌లు ఉన్నారు.


పర్యటన



జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్రకాలనీలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మురుగునీటి పైపులైను మార్చాలని ఆయనకు వివరించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- పేట్‌బషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):


రోడ్డు పనుల పరిశీలన



జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్‌లో నూతనంగా వేసిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ జగన్ స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీల్లో మిగిలిపోయిన రహదారులను త్వరలోనే పూర్తి చేపిస్తానని హామీనిచ్చారు.

- జీడిమెట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)

రంజాన్ వేడుకకు రండి



నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మైనార్టీ నాయకురాలు, తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి రఫియాబేగం బుధవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి రంజాన్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు.

- నిజాంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)

కల్యాణ మహోత్సవం



నిజాంపేట కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నె మహేష్ ప్రవీణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ తేజశ్రీనివాస్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని కల్యాణంలో అమ్మవారి ఆశీస్సులు పొందారు.

- నిజాంపేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)